
రామావత్ కుసుమ కుమారి

# అమ్మ మరోరూపం




సంక్రాంతి పండుగ ఇంకా మూడు రోజులే ఉంది. ఎప్పుడెప్పుడు ఊరు వెళతామా అని మనసు ఒకటే ఆరాటపడిపోతుంది. మా మావగారు పోయి నాలుగు సంవత్సరాలవుతుంది. అప్పటి నుండి మరి ఆ ఊరు వెళ్ళడమే మరచిపోయాం. అక్కడ ఉండేది ముగ్గురే. మా బావగారు, అక్క అత్తయ్యగారు. మా బావగారికి ఏ ఉద్యోగం లేదు. ఉన్న పొలాలను, ఆవులను, గేదెలను చూసుకోవడం అతని బాధ్యత. కాని ఆ బాధ్యతను సక్రమంగా నిర్వర్తించరు. ఆయనకు ముగ్గురు పిల్లలు సంతానం. ఇద్దరమ్మాయిలు. ఒక అబ్బాయి. పెద్దపిల్ల పెళ్ళైపోయింది. రెండో పిల్ల, అబ్బాయిలను వేరే ఊర్లో ఉంచి చదివిస్తున్నాం. మా అత్తగారిని చూడాలనుకున్నప్పుడు మా దగ్గరకు పిలిపించుకునేవాళ్ళం. ఇన్ని సంవత్సరాల గ్యాప్ తరువాత ఈసారి అందరం పండక్కి వెళ్ళాలని నిశ్చయించుకొని బయలుదేరి వెళ్ళాం. భోగి పండగరోజు ఉదయమే అందరం అక్కడకు చేరుకున్నాం. మా అత్తగారి ఆనందానికి అవధుల్లేవు. కొడుకులు, కూతురు, కోడళ్ళు, మనుమలు, మనవరాళ్ళు అందరూ ఆమె కళ్ళ ముందు ఉండేసరికి ఉప్పొంగిపోయింది. పలకరింపుల కార్యక్రమం అయ్యాక అందరం భోగి మంటలు వేశాం.

పల్లెటూరు కావడంతో ఆ వాతావరణం - ఆ ఆనందం చెప్పనలవి కాదు. పిల్లలయితే సరేసరి పట్నం నుండి పల్లెకు వెళ్ళడంతో వాళ్ళకి ప్రతి వస్తువు ఆటే అయ్యింది. రకరకాల పిండి వంటలు, జొన్నసంగటి, జొన్నరొట్టె, సజ్జల బూరెలు అన్నీ మనసుకు నచ్చిన వంటలే. జొన్న సంగటిలో గోంగూర పచ్చడి వెన్నతో కలిపి తింటే నిజ్జంగా .... అద్భుతం అలా అలా ఆరోజంతా రకరకాల రుచులతో గడిచిపోయింది.

మరుసటి రోజు పండగ. అందరం ఎంతో ఆనందంగా ఉన్నాం. మేము పండక్కి పట్టుకెళ్ళిన బట్టలు, స్వీట్సు అందరికి పంచాం. ఎవరికి ఏయే అవసరాలున్నాయో తెలిసినదాన్ని కాబట్టి అన్ని పట్టుకెళ్ళి ఇచ్చాను. సాయంత్రం అయ్యేసరికి ఆ చల్లటి వాతావరణంలో అందరం నడుచుకుంటూ పొలాలు చూసిరావటానికి బయలుదేరాం. అలా మూడు బ్యాచీలుగా నడుస్తూ, కబుర్లు చెప్పుకుంటూ పొలాలన్నీ కలియతిరిగాం. మా అత్తగారు, మా వారు, మా మర్ది మాట్లాడుకుంటూ వెనుక నడుస్తున్నారు. పిల్లలు సెలయేరులో స్నానాలు చేసి వస్తూ కనిపించిన చెట్టును పుట్టను కొట్టుకుంటూ - మొక్కలు, కాయలు, పువ్వులు పీక్కుంటూ చీకటి పడేసరికి ఇంటికి చేరాం. తిరిగి తిరిగి అలసి పోవటంతో త్వరగా భోజనాలు చేసి నిద్రకుపక్రమించాం.

మరుసటిరోజు ఉదయం అందరం ఆలస్యంగా లేచాం. కాఫీలు తాగి, సాయంత్రప్రయాణానికి అందరం సిద్ధమవుతున్నాం. ఎవరి సామాన్లు, బట్టలు వాళ్ళు సర్దుకోవడంలో నిమగ్నమయ్యారు. ఏదోపని ఉండి రూము నుండి బయటకు వస్తున్నాను. ఏవో మాటలు నా చెవిన

పడ్డాయి. ఎవరివా? ఆ మాటలు అని ఆల కించాను. మా మూడవ తోటికోడలు ఎవరి తోనో అంటున్న మాటలు 'నా రెండో కూతురు పెళ్ళి, కొడుక్కో ఉద్యోగం వచ్చేదాకా తప్పదు. మంచిగానే ఉండి పని జరిపించుకోవాలి. అందుకు ఆయుధం మా అత్తగారే. ఆమె బతికుండగానే అన్ని పనులు చక్కబెట్టుకోవాలి అని? నమ్మలేకపోయాను ! సర్దడం అయ్యాక స్నానాలు కానిచ్చి,భోజనాలకు కూర్చున్నాం. అయ్యాక అందరం వరండాలో మంచాలు వేసుకొని ఎవరి ఫ్యామిలీ దగ్గర వాళ్ళు కూర్చున్నాం. మా వారు నాతో 'త్వరలో ఇక్కడ ఒక ప్రాజెక్టు కట్టబోతున్నారు. అప్పుడు చాలా గ్రామాలు ముంపుకు గురి అవుతాయి. కాబట్టి వేరే దగ్గర జాగా చూశారట అది కొనిపించి వెళ్ళమంటుంది అమ్మ' అన్నారు.

'ముంపుకు గురయ్యే పొలాలు, ఇళ్ళకు ప్రభుత్వం డబ్బు ఇస్తుందికదా!అప్పుడు కొనొచ్చు ఇప్పుడు అంతఅర్జంటు ఏముంటుంది'అన్నాను.

'నువ్వు అలా అంటే అన్నయ్య, వదినా, అమ్మ బాధపడతారు.' అయితే మన పొలం కౌలుకు ఇచ్చారు కదా ! ఆ వచ్చిన డబ్బుతో కొనుక్కోమనండి. ఎట్లాగు ఇప్పటివరకు ఆ పొలం తాలుకు డబ్బు మనకు ఇవ్వడం లేదు కదా!' మాటల్లో పడిపోయాం. సాయంత్రం అయ్యింది. అందరం ప్రయాణానికి సిద్ధం అయ్యాం. మా అత్తగారు మా వారిని లోపలకు తీసుకెళ్ళి ఏదో మాట్లాడారు. కొంతసేపటి తర్వాత బయటకు వచ్చారు. వస్తూ వస్తూ అందరిచేతుల్లో డబ్బుపెట్టి సెలవు తీసుకున్నాం. ఎవరి ఊర్లకు వాళ్ళు వెళ్ళిపోయాం. ఊరునుండి వచ్చాక ఆ చర్చ మళ్ళా కొన సాగింది. మావారు నాతో 'వచ్చే టప్పుడు అమ్మతో జాగా కొనటానికి డబ్బు సరిపోకపోతే ఫోను చెయ్యండి పంపిస్తానని చెప్పాను, పంపించమని ఫోను చేశారు' అన్నారు.

'అవునండి ఫోన్ చేశారు సరే మీ తమ్ముడు కూడా కొంత ఇచ్చి వచ్చారట కదా ! అది ఇది కలిపి వచ్చినంత తీసుకోకుండా వాళ్ళు ఎంత జాగా కావాలో అంత కొనివ్వాలంటే సమయానికి డబ్బు ఉండాలి కదా ! వాళ్ళు ఉండేది ముగ్గురు. అత్తగారి వయసా అయి పోతుంది. తరవాత వాళ్ళిద్దరే కదా అక్కడ ఉండేది. పిల్లలు ఎవరి ఊర్లో వాళ్ళుంటారు. మావగారికి ఇచ్చిన మాట ప్రకారం పెద్ద పిల్ల పెళ్ళి చేశాం. రెండో పిల్లకి సంబంధాలు చూస్తున్నాం. రేపు ఆ పిల్లను ఒక అయ్య చేతిలో పెట్టాలంటే కట్నం ఇచ్చుకోక తప్పదు. అబ్బాయికి లంచం ఇవ్వనిదే ఉద్యోగం వచ్చేలా లేదు. ఇప్పటివరకూ వాళ్ళ చదువులకూ, అత్త గారికి మందులూ అన్ని మనమే చూస్తున్నాం. మిగిలిన వాళ్ళు పట్టించుకోవడం లేదు. మన పిల్లలూ ఎదుగుతున్నారు. వాళ్ళకీ రేపు ఉద్యోగాలు ఉంటాయో లేదో జాగ్రత్త పడకపోతే ఎలా? మీరు మరీ అంతమంచితనానికి పోవడం అంత మంచిదికాదేమో?వాళ్ళంతా వాళ్ళ వాళ్ళ స్వార్ధానికి మిమ్మల్ని, మీ అతి మంచి తనాన్ని ఉపయోగించుకుంటున్నారేమో?' అన్నాను.

'నువ్వు చెప్పింది నిజమే! మీకు నేనేం అన్యాయం చేయడం లేదు కదా ! ఉన్నదాంట్లో వాళ్ళకి కొంత ఇవ్వాలనుకుంటున్నాను.' 'మీరు మరీ అతిగా ఆలోచిస్తున్నారనిపిస్తుంది. మీ అన్నయ్యకి అన్ని సక్రమంగా ఉండి కూడా శ్రమజీవనానికి ఇష్టపడటం లేదు. మీరు నిజంగా సాయపడాలంటే అలాంటి వాళ్ళకు కాదు. ఎంతోమంది చూపులేక బాధపడు తున్నారు. అంతే కాకుండా చిన్న వయస్సులో గుండె జబ్బులతో బాధపడుతూ నరకం అనుభ విస్తున్నవారున్నారు. అలాంటి వాళ్ళకు సహాయం చేసినా అర్థం ఉంటుంది. మీ అన్నయ్య సోమరి తనాన్ని మీరు పెంచి పోషిస్తున్నారని పిస్తుంది.' 'నా తల్లి మనసు బాధపడకూదను కుంటున్నాను. మా అన్నయ్యలు చూస్తారో, లేదో నాకనవసరం. నేను చేయాలనుకున్నది మాత్రం చేస్తాను. ఎవరు ఏం చెప్పినా వినదలచు కోలేదు' అన్నారు.

'ఎవరు తల్లిదండ్రులను చూడొద్దని అనరు అది బాధ్యత కూడా. కాని మీ అన్నయ్య, వదిన మాత్రం అంతా వాళ్ళ అవసరాలకు తగ్గట్టు స్వార్ధంగా ఆలోచిస్తున్నారు. అన్ని ఎకరాల పొలం డబ్బు ఏం చేస్తున్నారు? పిల్లల్ని మనమే చూస్తున్నాం కదా ! ప్రతినెలా కాకపోయినా రెండు నెలలకొకసారి డబ్బు పంపిస్తూనే ఉన్నాం. అందరి పొలంలో అన్ని పండుతాయి. కాని మీ అన్నయ్య పొలంలో ఏమీ పండడం లేదు అంటారు. ఎందుకిలా జరుగుతుంది? అంటే అందరిలా కష్టపడకుండా ఏదో సాకు చెప్తున్నా రని అనిపిస్తుంది. హాయిగా ఆయన అవస రాలన్నీ మీరు తీరుస్తున్నారు కదా మరి ! అవస రానికి మించి పంపిస్తున్నారు. అందుకే ఆయన కష్టపడడానికి ఇష్టపడక మీరు పంపే డబ్బుతో హాయిగా బ్రతికేస్తున్నాడు.'

'అయితే అన్నదమ్ముల్ని చూడకుండా వదిలేయమంటావా'. 'వదిలేయమని నేనటం లేదు. అతనికి బాధ్యతను గుర్తుచేయ మంటు న్నాను. చేజేతులారా మీరే అతన్ని పాడుచేస్తున్నా రనిపిస్తుంది. ఇప్పుడుండి పంపిస్తున్నారు కాని మన అవసరాలు పెరిగాక పంపడం కుదరక పోతే కనీసం తన భార్యను తను పోషించుకో గలగాలి కదా ! నేను చెప్పింది మీరు నెగిటివ్ గానే ఆలోచిస్తున్నారు తప్పితే, పాజిటివ్‌గా ఆలో చించలేక పోతున్నారు. నేను చెప్పాల్సింది చెప్పాను అర్థం చేసుకుంటారని, ఆ తర్వాత మీ ఇష్టం' అని ఊరుకున్నాను.

మేము మాటల్లో పడి అక్కడ మా పెద్ద వాడు ఉన్నాడని కాని, ఇంటి దగ్గర నుండి ఈ విషయాలన్ని వింటున్నాడని, గమనిస్తున్నాడని కాని మాకు తెలియలేదు.

అక్కడ నుండి లేచి వంటగది వైపు నడిచాను. ఆయన పేపరు చదవడంలో నిమగ్నమయ్యారు. అప్పటివరకు ఆడుకుంటున్న మా పిల్లలిద్దరు కాదు కాదు మా సంభాషణంతా వింటున్న వాళ్ళు ఆడుకోవడానికి రాబోట్ బొమ్మ కావాలని మా పెద్దవాడు వాళ్ళనాన్న నడిగాడు. మావారు 'ఇప్పుడు అదెందుకురా? అంత డబ్బెక్కడుంది?' అన్నారు.వెంటనే వాడు 'అవును పప్పా నీ దగ్గర డబ్బుండదు మాకు పండగకు బట్టలు కొనాలన్నా, ఏదన్నా కొనాలన్నా! అదే పెద్దనాన్న వాళ్ళకి, ఏది కొనాలన్నా, పంపించా లన్నా నీదగ్గర డబ్బులుంటాయి' అన్నాడు. ఆ మాటలు విన్ననాకు వాడు అర్ధం అయి అన్నాడో లేక అర్ధం కాక అన్నాడో నాకు తెలియక అవా క్కయ్యాను. కష్టార్జిత ధనానికి, అనార్జిత ధనానికి ఉండే తేడా అంత తేలిగ్గా తెలియవు.